# ప్రేమిస్తే - అంతే!

"సరళ కొత్త వాచీ కొంది-"

ఇట్టే పాకి పోయిందావార్త - కార్యాలయంలోని అందరికీ. లంచాలుండని ప్రభుత్వ రంగ సంస్థ కనుక అక్కడ అందరూ కలివిడిగా ఉంటారు.

అధికారులు మినహా గుమాస్తాలందరూ స్త్రీ పురుష వ్యత్యాసం లేకుండా ఒక్కొక్కరూ వొచ్చి... కొత్త వాచీ చూడడమూ... మెచ్చుకోడమూ....

అందరికందరూ ముక్తకంఠంతో అన్నదేమిటంటే... "ఇంత ముచ్చటయిన వాచీ కొన్న సందర్భంగా - సరళగారు పార్టీ ఇవ్వాలి." అని.

కొందరు మాత్రం - "పార్టీ అంటే మరీ ఖర్చు. అంత శిక్ష వేసెయ్యకూడదు. కాఫీ ఇప్పించడం ధర్మం." అని న్యాయ నిర్ణయం చేశారు.

"అలాగే కాఫీయేగా?" ఆమోదించేసిందామె.

"భూత శాంతి జరిపిస్తారు కనుక మీ వాచీ పది కాలాల పాటు పనిచేస్తుంది." అని దీవించి వెళ్లిపోయారందరూ.

అందరూ అంత మెచ్చుకున్నా సరళ కానందంగా లేదు. అందరూ వొచ్చారు కానీ - రానిది వంశీ ఒక్కడే. అతను రాలేదు. రాడు..... తనకి తెలుసు...

ఆమెకి కన్నీళ్లు వొచ్చినంత పనవుతోంది.

వంశీ అంటే తనకెంతో ప్రేమా, ప్రాణమూ. కాని - అతనికి తనేమీ కాదు! తను అందగత్తె కాదుకదా? అతనేమో అధిక చక్కని వాడు. కథలలోనూ సినిమాలలోనూ ఆత్మ సౌందర్యమూ హృదయ సౌందర్యమూ అంటారేకాని నిజ జీవితంలో అమ్మాయిల అందచందాలను కాక ఆమె ఆత్మనీ అంతర్యాన్నీ హృదయంలోని ప్రేమనీ చూసేవారూ చూడగలిగేవారూ ఎందరు? ఐనా అతని కోసం తను నిరీక్షిస్తోంది - ఎంతో కాలంగానూ, ఎన్నో సంబంధాలను కాదనీ. ప్రేమ కూడా ఆశలాగే ఒకసారి పుట్టాలే కాని ఒకంతట చావదు. ఏదో అద్భుతమో అనూహ్యమో జరిగిపోయి - వంశీ తననీ తన ప్రేమనీ గుర్తించక పోతాడా ఏనాటికయినా అని - తన హృదయంలో చిన్న ఆశాదీపం మిణుకు మిణుకు మంటూ అయినా మిగిలే ఉంటోంది తప్ప ఆ ప్రేమ దీపం ఎంతకీ ఆరదు.

ఇంతమంది వొచ్చారే తన కొత్త వాచీ చూడడానికి, అతనెందుకు రాకూడదూ? కనీసం - సహోద్యోగిగా అయినా వొచ్చి - వాచీ చూసి... పలకరించి... అభినందించవచ్చుగా? రాకుండా... ఇలా శిక్షించడానికి... తనేం నేరం చేసింది? అతన్ని ప్రేమించడమే తన నేరమా?



తలవొంచుకుని -

రహస్యంగా దుఃఖిస్తున్న ఆమె-

"సరళా దేవిగారూ!" అన్న పిలుపుకి - నాగస్వరం చెవిన పడిన నాగిని లాగే ఆనందంగా తల ఎత్తి చూసింది. "వంశీ!" సంతోషం పట్టలేకపోయింది. ఒక్కసారి - ఆమె కన్నులలోకి కాంతి.... బుగ్గలలోకి గులాబుల ఎరుపు....

"మీరేదో వాచీ కొన్నారటగా?"

"ఔను" అంటూ తనచేతినతని ముందుకు చాచింది..... తన హృదయాన్నే అతని ముందు పరస్తున్నట్లు.

అతను ఆ వాచీని చాలా కుతూహలంగానూ పరిశీలనగానూ పట్టి పట్టి చూస్తూంటే.... ఆమె ఉద్విగ్నత చెందసాగిందా క్షణాలలో. అతనికి నచ్చినట్లు ఆ కన్నులే సూచిస్తున్నాయి.

"చాలా బాగుంది-" అన్నాడు వంశీ.

జన్మ ధన్యమైనట్లే అనిపించింది. సరళకి... ఆమె ఎంతో పొంగి పోయింది. మనసు నాట్యమే చేసింది పట్టలేక. వంశీకి బాగున్నది తన వాచీయా, తనా? తన వాచీ నచ్చిందనడంలో తను నచ్చిందన్న సూచన లేదూ? తన ప్రేమకిది శుభ సంకేతమా. ఏమో. ఎవరు చెప్పగలరు? కాలం - గాయాలను మాన్పుతుందట. అలాగే రాగోదయమూ కలిగిస్తుందేమో? ఏ నిముషానికి..... ఏమి జరుగునో... ఎవరూహించెదరూ?

"ఎక్కడ కొన్నారు?" అడిగాడతను.

"కాలమాన్ షో రూమ్‌లో..."

"ఎంత?"

"ఎనిమిది వందలు."

"చక్కగానూ చిరకాలమూ పనిచేస్తుందా?"

"ఓ."

"మీకు ఖచ్చితంగా తెలుసా?"

"ఆఁ.."

అతనొక్క క్షణం మౌనం దాల్చి... వాచీనే చూడసాగాడు.

"మీకు చాలా కృతజ్ఞతలు" అనేసిందామె... నిజానికి తను అతనికి థాంక్స్ చెప్పవలసిన సందర్భమెంత మాత్రమూ కాకపోయినా, ఇన్ని ప్రశ్నలు.... ఇన్ని మాటలు..... ఇంతసేపు... వంశీ తనతో! అంటే... అతనికి తన పట్ల...... శ్రద్ధ..... ఆసక్తి..... ప్రేమ.... కావూ?

"నాకు కృతజ్ఞతలు దేనికీ?" అయోమయంగా చూశాడు వంశీ.

ఆమె - అర్థవంతమయిన మందహాసం మాత్రం చేసి ఊరుకుంది... ఏమీ అనకుండా.

"నిజానికి - నేను మీకు చెప్పాలి థాంక్స్"

"దేనికీ?"

"ఎన్నాళ్ల నుంచో.... అంటే... అదే... సుమారు పది పదిహేను రోజుల నుంచీ లేడీస్ వాచ్ కొనాలనుకుంటున్నాను. కాని నాకు వాటి గురించి ఏమీ తెలియదు. మీ ధర్మమా అని ఇక బాధలేదు. అచ్చంగా ఇలాటిదే కొనేస్తే చాలు...."

"మీకెందుకూ లేడీస్ వాచ్?"

"ప్రజెంట్ చేసేందుకు-"

"ఎవరికీ?" ఆతృతా.... అనుమానమూ... భయమూ ఆపుకోలేక పోయిందామె. అతను - ఆమె ప్రశ్నను వినిపించుకోనట్లే వెళ్లి పోయాడక్కడి నుంచి.

ఆమె మనసులో ప్రశ్నలు.

వంశీ - ఖరీదయిన వాచీని బహుమతిగా ఇవ్వ బోతున్నాడంటే - అవతలి వారెవరో చాలా కావలసిన వారే అయివుంటారు. ఎవరు వారు? అక్కా, చెల్లెలా? లేక... వంశీ ఎవరినయినా ప్రేమించాడా? తేలని అనుమానం. తెగని ప్రశ్న. కెలికి వొదిలిన కొలనే అయిందామె అంతరంగం.

వంశీ! రాకా ఏడిపించావు... వొచ్చీ ఏడిపించావు! నీకిది న్యాయమా? అని దుఃఖిస్తూ ఉండిపోయిందా ప్రేమ హృదయిణి.

-ఐ. కవిత